


వాల్మీకిపురి.. రథోత్సవ సిరి !

వాల్మీకిపురం పట్టాభి రామాలయ సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో దేవదేవుడి రథాన్ని సీతారామ చంద్రులు అధిరోహించారు. తిలకించిన భక్తులు పులకించారు. - 8లో



సైబర్ నేరగాళ్ల పన్నాగం

ఓబులవారిపల్లె మండలం పున్నాటివారిపల్లి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి బసవగారి వినయ్ కుమార్ రెడ్డి అకౌంట్ నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 42 వేలు కాజేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.130	రూ.160
రెండోరకం	రూ.90	రూ.120

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 112 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	420	530
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 91.500 కిలోలు

న్యూస్‌రీల్

13న గురుకుల విద్యాలయాల ప్రవేశానికి పరీక్ష

రాయచోటి జగదాంబసెంటర్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి (2025-26) ఈ నెల 13న పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎ.ఉదయశ్రీ బుధవారం తెలిపారు. జిల్లాలో 11 పరీక్షా కేంద్రాల్లో 5వ తరగతిలో 880 సీట్ల కోసం 776 మంది, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 800 సీట్లకు 1,226 మంది విద్యార్థులు దరఖాస్తుల చేసుకున్నారని తెలిపారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు https://apbragcet.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 5 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. హాల్ టికెట్‌లో తప్పుగా ఉన్న వారు హెడ్ మాస్టర్ ధృవీకరించిన స్టడీ సర్టిఫికెట్, ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు.లేకపోతే పరీక్ష హాల్‌లోకి అనుమతి ఉండదని జిల్లా గురుకులాల సమన్వయకర్త ఉదయశ్రీ పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న పెన్షనర్స్‌పార్టీ అధ్యక్షుడు నారాయణ

మదనపల్లె సిటీ : ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ మదనపల్లె నూతన కార్యవర్గం ఎన్నికలు బుధవారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ ఎంఈఓ పోతబోలు రెడ్డప్ప వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా మణికంటి నారాయణ, సహాధ్యక్షుడిగా శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గురునారాయణచారి, సహ కార్యదర్శిగా ఎస్.కృష్ణమూర్తి, కోశాధికారిగా రెడ్డప్ప ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ పెన్షనర్స్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.కార్యక్రమంలో పెన్షనర్స్ పార్టీ నాయకులు మునిగోపాలకృష్ణ, రాజన్న, జగన్‌మోహన్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణాన్ని విజయవంతం చేయండి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రతి ఒక్కరూ కార్యదీక్షతో విధులు నిర్వర్తించి, శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులకు ఒక్కరోజు శిక్షణలో భాగంగా వారికి కేటాయించిన అంశాల్లో పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ కోదండరామ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 11న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం జరుగనుందన్నారు. సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి సీతారాముల వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారన్నారు. అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్న మహోత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

పాతాళంలో గంగ

- జిల్లాలో 21 మండలాల్లో పడిపోయిన భూగర్భ జలమట్టం
- గుర్రంకొండలో అత్యధికంగా 27 మీటర్లకు..
- మరో 260 పల్లెల్లో తరుముతున్న నీటి సమస్య
- తాగునీటి కోసం రూ.7.95 కోట్లతో వేసవి ప్రణాళిక



అచ్చమ్మకోటలో రైతు ఉత్తన్న 800 అడుగుల్లో బోరు వేయించినా చుక్కనీరు లభించలేదు



గోర్లముదివేడులో ట్యాంకర్లతో నీటి సరఫరా

బి.కొత్తకోట : గత ఖరీఫ్‌లో 19 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొని రైతాంగాన్ని తీవ్ర కష్టనష్టాలకు గురిచేసిన వర్షాభావ పరిస్థితులు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. దీని ప్రభావం జిల్లాలో తాగునీటిపై చూపుతోంది. వర్షాలు లేకపోవడంతో జిల్లాలో భూగర్భజలాల నీటి మట్టం లోతుకు పడిపోతోంది. అత్యంత ప్రమాదకర స్థితిలో గుర్రంకొండ మండలం ఉండగా మరో 23 మండలాల్లో నీటి మట్టాలు అధికంగా పడిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఈనెలఖారులోగా నీటి మట్టాలు ఇంకా ఎన్ని మీటర్లలోతుకు పడిపోతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు తాగునీటి కష్టాలు ఏడు మండలాల్లో నెలకొనగా.. ఇప్పుడా అప్పుడా అన్నట్టు మరో 260 పల్లెల్లో నీటి కష్టాలు కాచుకుని ఉన్నాయి. దీనితో వేసవి ప్రణాళిక అమలు చేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రభుత్వానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపింది.

ఇదీ భూగర్భ జల మట్టం

జిల్లాలో 30 మండలాలు ఉండగా అందులో ఆరు మండలాల్లో 20 మీటర్ల నుంచి 27 మీటర్ల లోతుకు నీటి మట్టం పడిపోయింది. రెండు మండలాలు 20 మీటర్ల లోతులో, 10 మండలాల్లో 14 నుంచి 20 మీటర్లలోపు లోతుకు తగ్గిపోయింది. మరో మూడు మండలాల్లో సాధారణ స్థితిలో ఉంది. మిగిలిన తొమ్మిది మండలాల్లో భూగర్భ జలమట్టం పరిస్థితి తారుమారైంది. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో లెక్కించిన భూగర్భ జలమట్టం లెక్కింపులో పడిపోయిన నీటిమట్టం మార్చిలో అమాంతం పైకి ఎగబాకడం విశేషంగా చెప్పుకోవాలి.

సేద్యానికి కష్టం

జిల్లాలో భూగర్భ జలమట్టం పడిపోవడం రైతులను తీవ్ర నష్టాలకు గురిచేస్తోంది. వ్యవసాయబోర్లపై ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. ప్రతి మండలంలోనూ ఆ ప్రాంతంలో సాగయ్యే పంటల రకాలపై ఆధారపడి రైతులు జీవనం సాగిస్తున్నారు. ఇటీవల పంటలకు వినియోగిస్తున్న సాగునీటి బోర్లనుంచి నీరు అడుగంటిపోతుండటంతో పంటలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. పంటలను ఎండబెట్టుకోలేక కొత్తగా బోర్లు వేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. వెయ్యి అడుగులలోతులోనూ నీటి జాడలు కనిపించడం లేదు.

ఇప్పుడు 79, ఇంకో 260 పల్లెలు

జిల్లాలో వేసవి ఒకవైపు, పడిపోతున్న భూగర్భ జలాలతో ప్రజలు తాగునీటికి కటకటలాడే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం జిల్లాలోని చిన్నమండెం మండలంలో ఒకటి, రాయచోటిలో 20, సంబేపల్లెలో 5, లక్కిరెడ్డిపల్లెలో 28, రామాపురంలో 10, గాలివీడులో 13, ములకలచెరువు మండలంలో రెండు పల్లెలో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీరికి ప్రతిరోజూ ట్యాంకర్లతో 165 ట్రిప్పులు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటికి ఈ పరిస్థితికాగా వచ్చే రోజుల్లో నీటి సమస్య తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా మరో 260 పల్లెల్లో నీటి సమస్య తలెత్తే ప్రమాదాన్ని నిర్ధారించి దీనిపై వేసవి ప్రణాళిక ద్వారా తాగునీటిని ప్రజలకు అందించడం కోసం రూ.7.95 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. వివిధ మార్గాల్లో నీటిని అందించడం కోసం ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఈ నిధులు అవసరమని నివేదించారు.

ఇదీ వేసవి ప్రణాళిక

ప్రతిపాదన	: రూ.7.95 కోట్లు
ఫ్లైలప్‌కు	: రూ.21.90 లక్షలు
ట్యాంకర్లతో సరఫరా	: రూ.7.69 కోట్లు
బోర్లలోతు, రిపేర్లు	: రూ.4.07 లక్షలు

జిల్లాలో మార్చికి నీటిమట్టం వివరాలు

మండలం	మీటర్లు	మండలం	మీటర్లు
గుర్రంకొండ	27.03	మదనపల్లె	18.20
ఓబులవారిపల్లె	26.01	కోడూరు	17.61
వీరబల్లి	25.16	టి.సుండుపల్లె	17.40
చిట్వేలి	24.57	తంబళ్లపల్లె	15.97
రామాపురం	22.91	చిన్నమండెం	15.85
రాజంపేట	21.70	రాయచోటి	15.63
పీలేరు	20.39	వాయల్పాడు	15.24
నిమ్మనపల్లె	20.02	పుల్లంపేట	14.86
ములకలచెరువు	19.26	కలకడ	9.65
కేవిపల్లె	18.25	పెనగలూరు	9.38
		పీటీఎం సముద్రం	7.05

తగ్గి, పెరిగిన నీటిమట్టం (మీటర్లు)

మండలం	ఫిబ్రవరి	మార్చి
పెద్దమండ్యం	23.96	11.12
కురబలకోట	11.41	10.78
ఎల్ఆర్‌పల్లె	31.40	10.27
బి.కొత్తకోట	11.51	8.41
రామసముద్రం	8.85	6.70
గాలివీడు	12.80	6.66
సంబేపల్లె	11.39	6.45
కలికిరి	7.30	6.38
నందలూర్	8.67	5.73

8 మీటర్లలే లెక్క

జిల్లాలో భూగర్భజల మట్టాలు పడిపోతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు భూగర్భ జలమట్టం 8 మీటర్లు దాటితే ప్రమాదకర సంకేతమని చెప్పింది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. 8 మీటర్లు, దానికంటే పైన నీటిమట్టం ఉంటే ఆ మండలాల్లో ఎలాంటి నీటి సమస్యలు తలెత్తవు. ఈ ప్రామాణికంగా చూస్తే జిల్లాలో అత్యధిక మండలాల్లో భూగర్భ జలమట్టం పడిపోతోంది. జనవరి, ఫిబ్రవరిలో భారీగా పడిపోవడం, మళ్లీ పెరగడం జరిగినా మార్చిలో మాత్రం భారీగా తగ్గింది. – హమీదాబాను, అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్టు

నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటాం

– ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



శశికుమార్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్సీపీ కార్యకర్తలు, నాయకులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి అండగా ఉంటామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాఘవరాజపురంలో నివాసముంటున్న వైఎస్సార్సీపీ నాయకుడు బత్తిన శశికుమార్‌రెడ్డి (45) రెండురోజుల క్రితం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొన్న ఎంపీ మృతుడి నివాసానికి వెళ్లి తల్లి సునీతమ్మ, అన్న శ్రీకాంత్‌రెడ్డి, కుమారుడు యశ్వంత్‌రెడ్డిలను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే రంగనాయకులపేట బూత్‌కన్వీనర్ గుత్తిసురేష్ గుండెపోటుతో మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి మృతుడి కుమారుడు పవన్‌కుమార్‌ను పరామర్శించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీలో క్రియాశీలకంగా ఉన్న నాయకులు మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు.కార్యక్రమంలో వైస్ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, మందలనాగేంద్ర, ముద్దా రామసుబ్బారెడ్డి, రత్తయ్య, రమేష్, నాగరాజ, అమర్, మందలశివయ్య, నందాబాల, మహేష్, చైతన్య, పురుషోత్తం, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ కార్యాలయాన్ని కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలోని మండలాల్లో నేరాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఫిర్యాదు దారులతో గౌరవ మర్యాదలతో ప్రవర్తిస్తూ ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి చట్ట పరిధిలో బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. వారంలో ఒక్క రోజూ మహిళా పోలీసులతో కలిసి పాఠశాలల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో మారకద్రవ్యాలు, బాల్య వివాహాలు, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు, వైట్ కాలర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులు రాజీ అయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లె డీఎస్పీ కొండయ్యానాయుడు, సిబ్బంది ఉన్నారు.

శ్రీరాముడిని రోల్‌మాడల్‌గా తీసుకోవాలి

రామయ్యను దర్శించుకున్న కడప, రాజంపేట ఎంపీలు



ఎంపీ మిథున్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, అర్చకులు

ఒంటిమిట్ట : శ్రీరాముడిని రోల్‌మాడల్‌గా తీసుకోవాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఒంటిమిట్ట రామయ్యను ఎంపీలు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. వీరికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. అలయ ప్రదక్షిణ గావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిచారు. ఆలయ రంగ మండపంలో వీరికి అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేసి, ఘనంగా సత్కరించారు. అనంతరం కడప ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రం బాగుండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.శ్రీరాముడు రాజుగా సుభిక్ష మైన పాలన అందిచాడని చెప్పారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని స్వామి వారిని కోరుకున్నట్లు చెప్పారు. కడప మేయర్ సురేష్ బాబు, జిల్లా రైతు విభాగ అధ్యక్షుడు సంబటూరు రాంప్రసాద్‌రెడ్డి, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ సౌమిత్రి, రాష్ట్ర కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాజంపేట నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు కూండ్ల ఓబుల్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టక్కోలు శివారెడ్డి, పంచాయతీ రాజ్ మండల అధ్యక్షుడు మేరువ శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి చర్యలు



జెండా ఊపి ఆటోలను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మంత్రి రాజంపేట మున్సిపాల్టీకి సీఎస్ఆర్ నిధులు రూ. 21 లక్షలతో కొనుగోలు చేసిన ఆరు చెత్తసేకరణ ఆటోలను జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌ల సమక్షంలో రాజంపేట మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించారు. ఎంప్రాడా మినరల్స్ ఎండీ ఆకేపాటి విక్రమ్ రెడ్డి ఆర్థికసాయంతో ఈ ఆటోలను కేటాయించారు. కొబ్బరికాయ కొట్టి జెండా ఊపి ఆటోలను ప్రారంభించారు.

గృహనిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలి : కలెక్టర్ శ్రీధర్

జిల్లాలో గృహ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో పేదలకు గృహనిర్మాణ పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టిన గృహనిర్మాణ పురోగతిపై ఆశాఖ డీఈలు, ఏఈలు, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఆగిపోయిన బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల ఇళ్లను త్వరగా పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. అర్హతగల ప్రతి లబ్ధిదారును డిజిటల్ అసిస్టెంట్ లాగిన్‌లో నమోదు చేయాలని సూచించారు. గృహ నిర్మాణశాఖ జిల్లా అధికారి శివయ్య తదితరులు పాల్గొన్నారు.



హనుమంత వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

అంజనీసుతపై కౌసల్యతనయ

- హనుమంతవాహనంపై రామయ్య విహారం
- తిలకించి..పులకించిన భక్తజనం



వాహనసేవలో భక్తజన సందోహం

ఒంటిమిట్ట : ఏకశిలానగరిలో వెలసిన కోదండ రామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం రాత్రి 7 నుంచి 8:30 గంటల వరకు హనుమంత వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగవాయిద్యాల నడుమ ఊరేగింపు కోలాహలంగా జరిగింది. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు రామయ్య నవనీతకృష్ణాలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం 11 నుంచి 12 వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా జరిగింది. ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.



కళాకారుల కోలాటాలు

నేటి కార్యక్రమాలు:

బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు మోహినీ అలంకారంలో స్వామి వారు భక్తులకు అభయమిస్తారు. రాత్రి 8 నుంచి 9:30 గంటల వరకు గరుడసేవ నిర్వహిస్తారు.

కల్యాణోత్సవ ఏర్పాట్ల పరిశీలన

శ్రీ సీతారాముల కల్యాణోత్సవ ఏర్పాట్లను టీటీడీ జేఈఓ వి వీరబ్రహ్మంతో కలిసి టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి బుధవారం పరిశీలించారు. టీటీడీ సీఈ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

- శుక్రవారం జరగనున్న సీతారాముల కల్యాణానికి సీఎం చంద్రబాబునాయుడు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఆయన వచ్చే మార్గాలను, ఉండే ప్రాంతాలను వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించారు.

డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

సంబేపల్లే : డ్రాపౌట్స్‌ను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖాదికారి సుబ్రమణ్యం పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు ప్రతిరోజు హాజరయ్యే విద్యార్థుల పేర్లను డ్రాప్ బాక్సులో ఉంచరాదన్నారు. అలా ఉండే వారిని తిరిగి చేర్చుకుని వారితో ఫోటో దిగి ఆన్‌లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. హాజరు పట్టికలో వివరాలు,ఆన్‌లైన్లోని విద్యార్థుల వివరాలు సరిపోవాలన్నారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల్లో వివరాలను పూర్తిగా నమోదు చేయాలన్నారు.ఈ నెల 21 నుంచి 24వ తేదీవరకు విద్యార్థుల నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యయుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంగంపేటలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఖనిజం

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ గనుల్లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెరైటీస్ ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని సెక్రటరీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ మైన్స్ ఐఏఎస్ అధికారి వీఎల్ కాంతారావు పేర్కొన్నారు. బుధవారం మంగంపేట ఏపీఎండీసీ గనులను ఆయన సందర్శించారు. ఈడీ కేదర్‌నాథ్‌రెడ్డి ఇక్కడ లభ్యమయ్యే వివిధ రకాల ఖనిజ నిక్షేపాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా కాంతారావు ముడి ఖనిజం వెలికితీత, ఎగుమతి తదితర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏపీఎండీసీ మంగంపేట కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈడీ కేదార్‌నాథ్‌రెడ్డి, సీపీఓ సుదర్శన్‌రెడ్డి, మైన్స్ మేనేజర్ గంగాధర్, సిబ్బంది ఎస్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ. కోటి విలువ చేసే మందులు పంపిణీకి సిద్ధం

రాయచోటి టౌన్ : జిల్లాలోని 30 మండలాల్లో పశువులకు ఉచితంగా వేసేందుకు సుమారు రూ.కోటి విలువ చేసే మందులు సిద్ధంగా ఉన్నాయని అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాలకు కావాల్సిన 200 రకాలకు పైగా పలు రకాల వ్యాధుల నివారణ మందులు అందజేశామన్నారు. ఈ మందులు ఆయా మండల పశువైద్యాధికారులు గ్రామ సచివాలయ పరిధిలోని పశువులకు, గొర్రెలకు, మేకలకు ఉచితంగా వేస్తారని తెలిపారు.

17 వరకు ప్రత్యేక నమోదు శిబిరాలు

రాయచోటి జగదాంబసెంటర్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – కార్మిక శాఖ – ఈ శ్రమ పోర్టల్‌లో ప్లాట్‌ఫాం కార్మికులను, గిగ్ కార్మికుల సమీకరణ, పేర్ల నమోదు కోసం ఈనెల 17వ తేదీ వరకు ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు కార్మిక శాఖ జిల్లా అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు ఆన్‌లైన్‌లో లేదా సమీపంలో ఉన్న కామన్ సరీ్వస్ సెంటర్, గ్రామ/ వార్డు సచివాలయాలలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు సిద్ధం



విద్యార్థి మిత్ర గైడ్‌లైన్స్ పత్రాలను ఎంఈఓకు అందజేస్తున్న రాష్ట్ర పరిశీలకుడు ప్రసాద్

సిద్దవటం : జూన్ 12వ తేదీన పాఠశాలలు తెరిచే లోపు విద్యార్థులకు అందజేసేందుకు సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యార్థి మిత్ర కిట్లు సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర పరిశీలకుడు పీవీకే ప్రసాద్ తెలిపారు. సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 15 నుంచి పాఠ్య పుస్తకాలతో పాటు బ్యాగులు, షూస్ వంటివి స్టాక్ పాయింటుకు చేరతాయన్నారు. జూన్ 12వ తేదీ నుంచి ఎంఈఓల ఆధ్వర్యంలో ఎంఆర్‌సీ సిబ్బంది మండలంలోని అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పద్మజ, ఎంఈఓ–2 అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా నిగార్ సుల్తానా



మదనపల్లె : అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన నిగార్ సుల్తానా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న కుటుంబం నుంచి వచ్చిన తనకు కాంగ్రెస్‌పార్టీ అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు.

వాల్మీకిపురి.. రథోత్సవ సిరి!

- వైభవంగా పట్టాభిరాముడి రథోత్సవం
- రామనామ స్మరణతో మార్మోగిన వాల్మీకిపురం



తేరుపై విశేష అలంకరణలో శ్రీసీతారామలక్ష్మణులు



విశేష భక్తజనం నడుమ రమణీయంగా పట్టాభిరాముడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి (వాల్మీకిపురం) : వాల్మీకిపురం పట్టాభి రామాలయ సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఏడో రోజు బుధవారం ఉదయం విశేష అలంకరణలతో తీర్చిన దేవదేవుడి రథాన్ని స్వర్ణాభరణ శోభితులైన సీతారామచంద్రులు అధిరోహించగా... రామదండు రామనామ స్మరణలతో కదలిరాగా.. దేవదేవుడి రథచక్రాలు ముందుకు కదిలాయి. అడుగడుగునా ఆధ్యాత్మిక శోభ సంతరించుకోగా ఇసుక పడినా రాలనంతగా భక్తజనం రాష్ట్రం నలుమూలల నుంచి తరలిరాగా పట్టాభిరాముడి రథోత్సవం రమణీయంగా సాగింది. రామనామ స్మరణలతో వాల్మీకిపురం పట్టణ వీధులు హోరెత్తాయి. తెల్లవారుజాము నుంచి సుప్రభాతసేవ, అభిషేకం, అర్చన, విశేష పూజలు జరిగాయి. నూతన వధూవరులైన శ్రీ సీతారాములను తిరుచ్చిలో అలంకరణలు చేసి రథారోహణం గావించారు. హాజరైన వందలాది భక్తజనం రథంపై మిరియాలు, పూలు, పండ్లు చల్లుతూ మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం దాకా సాగిన రథోత్సవం స్థానిక హరిమందిరం వద్ద సేదతీరగా భక్తులు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమై రాముడి రథం యథాస్థలికి చేరుకుంది. భోగోత్సవమూర్తులైన శ్రీసీతారామలక్ష్మణులను మోతగాళ్లు తమ భుజస్కంధాలపై ఎత్తుకుని పరుగు పరుగున పురవీధుల గుండా నిర్వహించిన ధూళి ఉత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి స్నపన తిరుమంజనం, కైంకర్యాలు, ఏకాంత సేవతో కార్యక్రమాలు ముగిశాయి. రథోత్సవం సందర్భంగా సీఐ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ శ్రీవల్లి, టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాల కుమార్, ఆలయ అధికారి కృష్ణమూర్తి, అర్చకులు కృష్ణ ప్రసాద్, కృష్ణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట రామయ్యకు పదార్థాల సమర్పణ



పదార్థాలను స్వామి వారికి సమర్పిస్తున్న ప్రతినిధులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ప్రతి ఏటా బీఎంఆర్‌జీఎఫ్ తరపున ఒంటిమిట్ట రామయ్యకు రైతులు పండించిన పదార్థాలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా బుధవారం బీఎంఆర్‌జీఎఫ్ చైర్మన్ సుమతి రెడ్డి ఆధ్వర్యంలో రైతులు పండించిన తినుబాండారాలను అధిక సంఖ్యలో ఒంటిమిట్ట రామయ్యకు సమర్పించారు. ఇవి సమర్పించే సమయంలో రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కూడా దర్శనానికి రావడంతో ఆయనతో కలిసి స్వామి వారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేటకు చెందిన ప్రతాప్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, కడపకు చెందిన శివశంకర్‌రెడ్డి, రాచపల్లికి చెందిన మాజీ వీఎం సుబ్బారెడ్డి, మాధవరం, కడప కు చెందిన హ్యాపి కిడ్స్ పాఠశాల యాజమానులు అనిల్‌రెడ్డి, కడప, రాజంపేట లోని హరితా హోటల్ కు సంబంధించిన మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట సీతారాముల కల్యాణానికి పటిష్ట భద్రత

జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్



పోలీసు అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, పోలీసు అధికారులు

కడప అర్బన్/ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 11న శుక్రవారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్న సందర్బంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ తెలిపారు. రెండు వేల మందికి పైగా పోలీసులను నియమించామన్నారు. బందోబస్తు విధుల్లో నలుగురు అదనపు ఎస్పీలు, 25 మంది డీఎస్పీలు, 73 మంది సీఐలు, 177 మంది ఎస్ఐలు, 1700 మంది పోలీసు సిబ్బంది ఉంటారని తెలిపారు. బుధవారం కడప నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్.పి బందోబస్తు విధుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి, ఏ.ఆర్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అలాగే ఒంటిమిట్ట ఆలయం వద్ద కూడా పోలీసులకు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రించాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, అదనపు ఎస్పీ (ఏ.ఆర్) బి.రమణయ్య, ఏ.ఆర్. డీఎస్పీ కె.శ్రీనివాస రావు, ఎస్.బి. ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్.ఐ లు ఆనంద్, వీరేష్, శివరాముడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కల్యాణోత్సవానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి కల్యాణోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి శుక్రవారం ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి 35 బస్సులు, పులివెందుల 12, బద్వేలు 22, జమ్మలమడుగు 12, మైదుకూరు 7, ప్రొద్దుటూరు 17, రాయచోటి, రాజంపేట, ఇతర డిపోల నుంచి 40 బస్సులు చొప్పున మొత్తం 145 బస్సులు నడుస్తాయన్నారు. పార్కింగ్ స్థలాల నుంచి కల్యాణోత్సవం జరిగే ప్రాంతం వరకు 20 ఉచిత బస్సులను నడపనున్నామన్నారు.

నలుగురు జూదరులపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మద్దయ్యగారిపల్లి సమీపంలో జూదం జోరు అధికంగా సాగుతోందని పలువురు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ హరిహర ప్రసాద్ సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. పట్టుబడిన నలుగురు జూదరులపై కేసు నమోదు చేసి వారి వద్ద లభించిన రూ.2,910ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

మద్యం విక్రయంపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం పంచాయతీ క్రిష్టాపురంలో ఓ మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తోందని సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సదరు మహిళ ఇంట్లో ఉన్న 14 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిహర ప్రసాద్ తెలిపారు.

బైకు ఢీకొని మహిళకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన చిన్నక్క

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా కోదండ రామాలయం వెనుక వైపు పారిశుధ్యం పని చేస్తున్న కత్తి చిన్నక్క(55) అనే మహిళను బైకు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని 108 సాయంతో కడప రిమ్స్‌కు తరలించారు. ఒంటిమిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

వైఎస్సార్, అన్నమయ్య జిల్లా రైల్వేలకు అన్యాయం

డీఆర్‌యూసీసీ మీట్‌లో తల్లెం భరత్‌రెడ్డి

రాజంపేట : రైల్వేశాఖ వైఎస్సార్, అన్నమయ్య జిల్లా రైల్వేలకు అన్యాయం చేసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం జరుగుతోందని గుంతకల్ డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం డీఆర్‌యూసీసీ మీట్‌లో పాల్గొని మాట్లాడారు. కోవిడ్–19 ముందు ఉన్న వివిధ రైళ్లకు ఉన్న హాల్టింగ్స్‌ను ఇంతవరకు పునరుద్ధరించలేదన్నారు. రాయలసీమ ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో చిన్న చిన్న స్టేషన్లలో కూడా రైళ్లు ఆగుతున్నాయన్నారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో రైళ్లకు కనీసం తాత్కాలిక హాల్టింగ్స్ ఇవ్వమని, ఎంపీ మిథున్‌రెడ్డి రైల్వేబోర్డు, రైల్వేమంత్రిత్వ శాఖను కోరారన్నారు. నందలూరులో రైళ్లకు వాటరింగ్ సౌకర్యం కల్పిస్తే, రైళ్లలో నీటి సమస్య తీరుతుందన్నారు. ఈ సమావేశంలో మరో సభ్యుడు తంబెళ్ల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పుల్లంపేటలో చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్

పుల్లంపేట : పుల్లంపేట మండలంలోని నాగలపూరు గట్టువద్ద షేక్ మస్తాన్ ట్రావెల్ ఏజెంట్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఇంటికి తాళం వేసి తన కుమార్తెను చూసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి రాయచోటికి వెళ్లాడు. గమనించిన దొంగలు మంగళవారం రాత్రి ఇంటిలోకి వెళ్లి సుమారు 160 గ్రాముల బంగారు, రూ. 8 లక్షలు నగదు అపహరించినట్లు బాధితుడు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ పరిశీలించారు.

అవినీతి జూనియర్ లైన్‌మెన్‌పై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



జూనియర్ లైన్‌మెన్ రామేశ్వర్‌రెడ్డి అక్రమ వసూళ్లపై విచారణకు వచ్చిన విజిలెన్స్ బృందం

గాలివీడు : అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జూనియర్ లైన్‌మెన్ రామేశ్వర్‌రెడ్డి అక్రమ వసూళ్లపై విజిలెన్స్ బృందం విచారణ చేపట్టింది. ఏప్రిల్ 4 వ తేదీ సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'విద్యుత్ శాఖలో మాయగాడు' అనే కథనంపై స్పందించిన జిల్లా అధికారులు విచారణకు ఆదేశించారు. అందులో భాగంగా బుధవారం గాలివీడు మండలంలో ట్రాన్స్‌కో ఎస్ఐ మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో తన సిబ్బందితో కలిసి గాలివీడు పట్టణంలోని చిలకలూరిపేట, ఎగువగొట్టివీడు గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. అనంతరం బాధితుల వద్ద నుంచి జూనియర్ లైన్‌మెన్ ఎంత డబ్బులు వసూలు చేశారన్న విషయంపై రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ రికార్డ్ చేసుకున్నట్లు తెలిపారు. అయితే అధికారులు ఆకస్మికంగా విచారణకు రావడంతో కొందరు కూలి పనులకు వెళ్లడంతో అందుబాటులో ఉన్న వారు మాత్రమే తమ గోడును విన్నవించుకున్నారు. ఇదే విషయమై అధికారుల దృష్టికి తీసుకురాగా ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే తమ కార్యాలయంలో గానీ ఫోన్ ద్వారా గానీ సంప్రదించవచ్చని ట్రాన్స్‌కో ఎస్ఐ సూచించారు.

అడవిలో దారితప్పిన ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ సురక్షితం



అడవి నుంచి సురక్షితంగా బయటకు వచ్చిన సీఐ తులసి

ఓబులవారిపల్లె : మండలంలోని వై.కోట అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ సీఐ తులసి ఎస్ఐ వరుణ్ కుమార్‌తో కలిసి బుధవారం తెల్లవారుజామున అడవిలోకి వెళ్లారు. అడవిలో కాలినడకన కొద్ది దూరం వెళ్లగా దట్టమైన ప్రాంతం రావడంతో దారి తెలియక వారు తప్పిపోయారు. విషయం తెలుసుకున్న ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్ తమ సిబ్బందితో కలిసి వై.కోట శేషాచలం అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. సీఐ తులసి లొకేషన్ పంపించడంతో దాని ఆధారంగా వారిని గుర్తించి క్షేమంగా అడవి నుంచి బయటకు తీసుకువచ్చారు. వీరు తప్పిపోయిన ప్రాంతం ఇటీవల ఏనుగుల దాడిలో ముగ్గురు మృతి చెందిన ప్రదేశం ఒక్కటే కావడం గమనార్హం. సీఐ, ఎస్ఐ తప్పిపోయిన విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

• స్నేహమంటే ఇదేరా!




కుక్కతో సరదాగా ఆడుకుంటున్న పిల్లి

ఈ సృష్టిలో స్నేహానికన్నా మిన్న మరేదీ లేదంటారు. స్నేహం చాలా స్వచ్ఛమైనది. మనకు మనమే సృష్టించుకున్న అతి మధురమైన బంధం. అయితే కొన్ని జాతుల మధ్య కేవలం శత్రుత్వం మాత్రమే ఉంటుంది. కుక్క, పిల్లి.. ఎలుక, పిల్లి.. కుక్క,కోతి ఇవి నిత్య శత్రువులు. ఇవి ఒక దానికి ఒకటి తారసపడితే చాలు కయ్యానికి కాలు దువ్వుతాయి. అలాంటిది జాతి వైరాన్ని మరచి కుక్కతో పిల్లి సరదాగా ఆడుకుంటున్న సంఘటన మదనపల్లె మండలం తట్టివారిపల్లెలో జరిగింది. ట్రక్ వెల్ విషర్స్ సభ్యులు సెల్‌ఫోన్‌లో బంధించిన ఈ దృశ్యం వైరల్‌గా మారింది.

– మదనపల్లె సిటీ

సైబర్ నేరగాళ్ల పన్నాగం

రూ. 42 వేలు విద్యార్థి అకౌంట్ నుంచి స్వాహా



తన కుమారుడి అకౌంట్‌లో డబ్బులు డ్రా చేసినట్లు చూపిస్తున్న రమణారెడ్డి

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని పున్నాటివారిపల్లి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి బసవగారి వినయ్ కుమార్ రెడ్డి అకౌంట్ నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 42 వేలు కాజేశారు. తమ కుమారుడి అకౌంట్ నుంచి అతనికి తెలియకుండా డబ్బులు డ్రా చేశారని బుధవారం వినయ్ కుమార్ తండ్రి బసవగారి రమణారెడ్డి మండలంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకును సంప్రదించారు. నాలుగు విడతలుగా రూ. 42 వేలు విత్ డ్రా చేశారని బ్యాంకు మేనేజర్ గుర్తించారు. తమ కుమారుడు చెన్నైలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడని రమణారెడ్డి తెలిపారు. కాలేజీ ఫీజుకు సంబంధించి డబ్బులు వేయగా మరుసటి రోజే విత్ డ్రా చేసినట్లు మేసేజ్‌లు రావడం గమనించి తమకు చెప్పడంతో బ్యాంకులో నిర్ధారించుకుని సైబర్ నేరగాల బారిన పడినట్లు తెలిసిందన్నారు. తమ ప్రమేయం లేకుండా అకౌంట్‌లో డబ్బులు డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు బ్యాంకు మేనేజర్‌ను కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



వరుణ్‌కుమార్ రెడ్డి (ఫైల్)



మృతి చెందిన వరుణ్‌కుమార్‌రెడ్డి

రామాపురం : కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిలో మండల పరిధిలోని ఐరిస్ హోటల్ సమీపంలో బుధవారం కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో వరుణ్‌కుమార్‌రెడ్డి(21) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి కథనం మేరకు మండలంలోని బండపల్లె పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన వరుణ్ కుమార్‌రెడ్డి ద్విచక్రవాహనంలో రాయచోటి నుంచి వస్తుండగా కడప వైపు నుంచి అరుణాచలం వెళ్తున్న ఏపీ39ఎస్‌క్యూ 5835 గల ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికి అంది వచ్చిన కొడుకు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

- బెట్టింగ్ నిర్వహిస్తున్న 23 మంది అరెస్టు
- రూ.3.10 లక్షలు నగదు, 23 సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఆన్‌లైన్‌లో రూ. 1 కోటికి పైగా జరిగిన లావాదేవీలు
- బెట్టింగ్ కేసులో పలువురు టీడీపీ నాయకులు



క్రికెట్ బుకీల అరెస్టు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ప్రొద్దుటూరు డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న క్రికెట్ బెట్టింగ్ ముఠాను ప్రొద్దుటూరు పోలీసులు అరెస్ట్ చేశారు. యాప్‌ల ద్వారా బెట్టింగ్ కొనసాగిస్తున్న ముఠా కార్యకలాపాల గుట్టు రట్టు చేశారు. రెండు వేర్వేరు కేసుల్లో 25 మందిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 3.10 లక్షలు నగదు, 23 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ వివరాలను ప్రొద్దుటూరు డీఎస్పీ భావన బుధవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభం అయిన నాటి నుంచి ప్రొద్దుటూరు డీఎస్పీ భావన ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి క్రికెట్ బెట్టింగ్‌పై నిఘా ఉంచారు. ఇందులో భాగంగానే బుకీలకు కౌన్సెలింగ్ ఇచ్చి బైండోవర్ చేశారు. ఈ క్రమంలో ప్రొద్దుటూరులోని రామేశ్వరం నీళ్లట్యాంకు వద్ద క్రికెట్ పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో 18 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 2.05 లక్షలు నగదు, 18 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పట్టుబడిన దొరసానిపల్లెకు చెందిన పుత్తాగిరీష్ అనే వ్యక్తి గతంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించి తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలో బిగ్‌బబూల్ 247.కామ్ అనే వెబ్‌సైట్‌లో కొంత మంది యువకులను యాప్‌లో చేర్చుకొని పందేలు నిర్వహించేవాడు. ఇలా సుమారు 40 మంది బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరి ఖాతాలను పరిశీలించగా సుమారు రూ. 1 కోటి పైగా లావాదేవీలు జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. వీరి బ్యాంక్ ఖాతాలను పరిశీలించి ఫ్రీజ్ చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో పుత్తా గిరీష్‌కుమార్‌తో పాటు సాధు వీరప్రసాద్, పాతకోట ప్రతాప్‌రెడ్డి, ఆవుల సుబ్బారెడ్డి, బీచెర్ల సుబ్బారెడ్డి, వరదా సుధాకర్, మార్తల గురుశేఖర్‌రెడ్డి, మైలాగిని శివచైతన్య, సాధు పవన్‌కుమార్, నల్లమారు నాగేంద్ర, వరదా ఆంజనేయులు, చిన్న కొండగిరి సుబ్బయ్య, మేకల మదనబాబు, ఎర్రమాసు ప్రతాప్, పబ్బతి శివశంకర్, తాటికొండ శ్రీను, తాటికొండ జగన్, భరతికవి చిన్నలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరంతా ప్రొద్దుటూరు మండలంలోని దొరసానిపల్లె, చౌటపల్లె తదితర ప్రాంతాలకు చెందిన వారు. ఇదే కేసులో 23 మందిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు.

మరో కేసులో ఐదుగురు అరెస్ట్

పట్టణంలోని ఇస్లాంపురం వీధిలో క్రికెట్ పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో కోనేటి కాల్వవీధికి చెందిన షేక్ మాబుషరీఫ్ అలియాస్ చుంచు, పిందాల జనార్దన్‌రెడ్డి, భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, వేంపల్లి సుదర్శన్‌రెడ్డి, శ్రీరామ్ సుబ్బరాయుడు ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ. 1.05 లక్షలు నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లోని 23 మంది నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

బెట్టింగ్ వ్యవహారంలో బడా బుకీల ప్రమేయం

బెట్టింగ్ వ్యవహారంలో ప్రొద్దుటూరులోని బడా బుకీలైన టీడీపీ నాయకులకు సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పలువురు టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేశారు. దొరసానిపల్లె సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ భర్త అరవ మునివర, షేక్ ఫారూక్, షేక్ గౌస్‌బాషా అలియాస్ బెంగళూరు బాషా, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ 25వ వార్డు కౌన్సిలర్ షేక్ పెహనూర్ భర్త ఖాదర్‌బాషాతో పాటు ఏలే నరసింహులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇస్లాంపురం వీధిలో పట్టుబడిన ఐదుగురు బుకీలు వీరి కనుసన్నల్లో క్రికెట్ పందేలు నిర్వహిస్తున్నారని చెప్పారు. వీరిపై ప్రొద్దుటూరుతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ క్రికెట్ పందేల కేసులు ఉన్నాయి. ప్రొద్దుటూరులో ప్రప్రథమంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారిపై బీఎన్ఎస్ 111 (2), 112 (2) అనే కొత్త సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశామన్నారు. ఇందులో బీఎన్ఎస్ 111 (2) సెక్షన్ అనేది తీవ్రమైందని తెలిపారు. ఈ రెండు కూడా నాన్‌బెయిలబుల్ సెక్షన్‌లని, వ్యవస్థీకృత నేరం కింద 7 నుంచి 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.

బెట్టింగ్ నిర్వాహకులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు

బెట్టింగ్ నిర్వాహకులు ఎంతటి వారైనా వదలే ప్రసక్తి లేదని డీఎస్పీ తెలిపారు. వ్యవస్థీకృత నేరాల కింద కేసులు నమోదు అయితే బెయిల్ కూడా రాదన్నారు. చాలా మంది యువకులు కూడా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్నారు. యువత బెట్టింగ్ మోజులో పడి జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. ప్రతి యాప్, వెబ్‌సైట్ పైనా పోలీసుల నిఘా ఉందన్నారు. ఐడీలు, ఐపీ అడ్రస్ ఆధారంగా యాప్‌లు ఎక్కడ క్రియేట్ చేశారో తెలుసుకొని సంబంధిత నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసులో శ్రమించిన సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది రఘు, రామ్మోహన్‌లను డీఎస్పీ భావన అభినందించారు. రివార్డు కోసం జిల్లా ఎస్పీకి సిఫార్సు చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో సీఐలు సదాశివయ్య, గోవిందరెడ్డి, బాలమద్దిలేటి పాల్గొన్నారు.